


పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 2 సంచిక : 84 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | గురువారం 26 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :84 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : ONGOLE | THU 26 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

ఏఐ అదుపు తప్పితే.. ఆపడం ఎవరి వల్లా కాదు!



- కిల్ స్విచ్ కూడా సరిపోదన్న ఓపెన్ఏఐ మాజీ డైరెక్టర్..
- చెర్నోబిల్ తరహా విపత్తుపై మరో నిపుణుడి హెచ్చరిక
- విదేశీ కంప్యూటింగ్ వ్యవస్థల్లో ఏఐలపై నియంత్రణ అసాధ్యమని ఆందోళన
- అమెరికా, చైనా కలిసి పనిచేయకపోతే పెను ప్రమాదమని వెల్లడి
- ఏఐతో 'చెర్నోబిల్' తరహా మహా విపత్తు పొంచి ఉందన్న హింటన్
- ఆర్థిక, పవర్ గ్రిడ్ వ్యవస్థలను ఏఐ స్తంభింపజేసే ప్రమాదం

- మిగతా 2లో

పుట్టిన ప్రదేశంపై స్పష్టత ఇవ్వండి.. సౌరవ్‌దాస్‌కు కేంద్రం నోటీసులు



పెన్ పవర్ డెస్క్: కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్‌కు సంబంధించి తన పాస్‌పోర్టులో పేర్కొన్న పుట్టిన ప్రదేశం వివరాలపై వ్యత్యాసాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయంపై భద్రతా సంస్థల నుంచి నివేదికలు అందాయని.. ఈ నేపథ్యంలోనే ఆయనకు చెన్నైలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు విదేశాంగ

- మిగతా 2లో

సీఐఏనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

అమెరికా నిఘా కోటలో కలకలం..

- ఆర్టెక్స్ ఏఐ టూల్‌తో సైబర్ దాడి జరిగినట్లు అనుమానాలు..
- బహిరంగ సమాచారాన్ని తస్కరించిన హ్యాకర్లు



- మిగతా 2లో



- ఏపీ వ్యాప్తంగా తొలి విడత స్థానిక ఎన్నికల పోలింగ్
- గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్
- పంచాయతీ ఎన్నికల ఫలితాలు నేడు సాయంత్రానికే వెల్లడి
- నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లోనూ నేడు ఎన్నికలు
- పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు నవంబర్ 30న నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లో (గురువారం, నవంబర్ 26) ఎన్నికల సందడి నెలకొననుంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓటు పండుగ వాతావరణం కనిపించనుంది. పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 26 జిల్లాల పరిధిలోని 201 మండలాల్లో పంచాయతీ ఎన్నికలతో పాటు, గతంలో వివిధ కారణాలతో వాయిదా పడిన 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలకు రేపు ఉదయం నుంచే పోలింగ్ ప్రారంభం కానుంది.

- మిగతా 2లో

ఏపీ సొంత రాబడి పెరిగింది..

ఆదాయార్జన శాఖలపై చంద్రబాబు కీలక సమీక్ష



- రాష్ట్ర సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి నమోదు
- ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు
- నవంబర్ 23 నాటికే 58 శాతం వార్షిక లక్ష్యం పూర్తి
- వాణిజ్య, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో పెరిగిన రాబడి
- పన్నుల పరిశీలన, ఆడిట్‌లలో ఏఐ సాంకేతికత వినియోగం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆదాయార్జన శాఖల పనితీరు, రాబడి వృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, పరిపాలనా సంస్కరణలు, క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయానికి నమోదైన రూ.62,604 కోట్లతో పోలిస్తే ఇది రూ.11,738 కోట్లు అధికమని, మొత్తంగా 18.7 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా 2లో

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

పెట్టుబడుల రక్షణ చట్టంపై బిల్లు పెట్టే అవకాశం



- ఏపీ శాసనసభ శీతాకాల సమావేశాలకు డేట్ ఫిక్స్
- పెట్టుబడుల రక్షణ చట్టం' బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం
- రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా పరిశ్రమలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇటీవల సీఐఐ సదస్సులో భారీ పెట్టుబడుల ఒప్పందాల నేపథ్యంలో కీలక అడుగు

- మిగతా 2లో

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు.. కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..



పెన్ పవర్ డెస్క్:కాకినాడ జిల్లా ఉప్పాడ మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 19న సముద్రంలో గల్లంతయ్యారని ప్రకటించారు కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కోస్ట్‌గార్డ్ అధికారులకు తెలియజేసిందని అన్నారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 18వ తేదీన ఒడిశాలోని పారాదీప్ పోర్టు

- మిగతా 2లో

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

- త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమన్న కవిత
- టీఆర్ఎస్ పార్టీ ఆదరణ చూసి ఓర్వలేకే తనపై దాడులు చేస్తున్నారని వ్యాఖ్య
- ఇప్పటికే తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని ఆవేదన

- మిగతా 2లో



భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

25 శాతం వరకు సుంకాల ముప్పు!




- వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతానికి తగ్గే అవకాశం..
- భారత్ సహా 14 దేశాలపై అమెరికా ప్రతిపాదన
- అధిక పారిశ్రామిక ఉత్పత్తి అమెరికా మార్కెట్‌ను దెబ్బతీస్తోందన్న వాషింగ్టన్
- ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం జనవరి నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్

- మిగతా 2లో


నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

10 లక్షల మందితో 'మైటీడీపీ' అతిపెద్ద మైలురాయి

- మైటీడీపీ యాప్‌లో నమోదైన కార్యకర్తల సంఖ్య పది లక్షలకు చేరిక
- పార్టీతో కార్యకర్తలను నేరుగా అనుసంధానించేందుకు సరికొత్త సాంకేతికత
- క్షేత్రస్థాయిలో కష్టపడే శ్రేణులకు గుర్తింపునిచ్చేలా నారా లోకేశ్ సూచనలతో ప్రత్యేక వ్యవస్థ
- అభిప్రాయ సేకరణతో పాటు పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణకు డిజిటల్ వేదిక
- నరసరావుపేట, కుప్పం సహా పలు నియోజకవర్గాల్లో యాప్ వినియోగం ముందంజ



- మిగతా 2లో



జగన్ సీఎం పదవి అడిగారు..

సోనియా నో చెప్పారు!

- జగన్ కాంగ్రెస్‌ను వీడటంపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు.. '
- వెన్నుపోటుదారుడు ఎవరు?' అంటూ ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై సంచలన ఆరోపణలు చేశారు. జగన్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఈ మేరకు రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ

- మిగతా 2లో

పెన్ పవర్

గురువారం 26 నవంబర్ 2026



భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది.అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు. మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో దంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి.అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ సుంకాలు అమల్లోకి రావచ్చని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.గతంలో ట్రంప్ ప్రభుత్వం విధించిన గ్లోబల్ టారిఫ్‌లను చెల్లవంటూ, అధ్యక్షుడికి ఆ విధమైన చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని నెలలకే ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఆటోమొబైల్స్, స్టీల్ వంటి నిర్దిష్ట రంగాలపై మాత్రమే ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి.

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు..
కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..

- మొదటి పేజీ తరువాయి

సమీపంలో కనిపించినట్లు ప్రాథమికంగా గుర్తించారని... ఆ తరువాత వారు ఫోన్ ద్వారా గానీ, ట్రాన్స్‌పాండర్ ద్వారా గానీ ఎలాంటి సమాచారం అందుబాటులోకి రాలేదని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైనట్లు సమాచారం అందిన వెంటనే కాకినాడ కోస్ట్‌గార్డ్ అధికారులు తక్షణమే స్పందించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారని తెలిపారు.

కోస్ట్ గార్డ్, నేవీ అధికారుల సంయుక్త గాలింపు:

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులు సంయుక్తంగా విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. యుద్ధ నౌకలు, హెలికాప్టర్లతో సముద్రం లో నిరంతరాయంగా గాలింపు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని బంగ్లాదేశ్, మయన్మార్ నేవీ అధికారులతో కూడా పంచుకున్నట్లు తెలిపారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా తిరిగి వస్తారని... వారి ఆచూకీ లభించే వరకు సంబంధిత అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను కొనసాగించనున్నట్లు తెలిపారు కలెక్టర్.

ఏఐ అదుపు తప్పితే..
ఆపడం ఎవరి వల్లా కాదు!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను విధ్వంసకర శక్తుల చేతుల్లోకి వెళ్లినా లేదా నియంత్రణ కోల్పోయినా దాన్ని ఆపడానికి ఎలాంటి 'కిల్ స్విచ్' (ఎమర్జెన్సీ షట్‌డౌన్) పనిచేయదని ఓపెన్‌ఏఐ మాజీ బోర్డు సభ్యురాలు హెలెన్ టోనర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన భద్రతా నిపుణురాలైన ఆమె ఏఐ ముప్పు తీవ్రతను వివరించారు.ఒక్క కిల్ స్విచ్‌తో అన్ని సమస్యలనూ పరిష్కరించడం అసాధ్యమని టోనర్ స్పష్టం చేశారు. కొన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో వేర్వేరు స్థాయుల్లో షట్‌డౌన్ లేదా ఓవర్‌రైడ్ వ్యవస్థలు ఉపయోగపడతాయేమో కానీ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన వ్యవస్థలను పూర్తిగా ఆపలేవని తెలిపారు. అమెరికా పరిధికి ఆవల, పూర్తి స్వయంప్రతిపత్తితో నడిచే కంప్యూటింగ్ వ్యవస్థలపై పనిచేసే ఏఐలను నియంత్రించడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు. చైనా పోటీని బూచిగా చూపిస్తూ అత్యంత ప్రమాదకరమైన ఏఐ టెక్నాలజీని గుడ్డిగా అభివృద్ధి చేసుకుంటూ పోవడం ఆత్మహత్యాసదృశ్యమని అభిప్రాయపడ్డారు.మరోవైపు 'ఏఐ గాడ్‌ఫాదర్'గా పేరొందిన జెఫ్రీ హింటన్ సైతం ఏఐ ముప్పుపై తీవ్ర హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ లేదా ఆర్థిక వ్యవస్థలను స్తంభింపజేసేలా ఏఐ వల్ల 'చెర్నోబిల్' తరహా పెను విపత్తు సంభవించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఏడాది లేదా రెండేళ్లలోనే ఇలాంటి దుర్ఘటన జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి తీవ్రమైన రిస్కులు ఉంటాయని తెలిసినప్పటికీ ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, శామ్ ఆల్ట్‌మన్ వంటి దిగ్గజాలు లాభాల కోసం పోటీపడుతున్నారని హింటన్ విమర్శించారు. ఏఐ చాట్‌బాట్లు సొంత భాషను అభివృద్ధి చేసుకుంటే నియంత్రణ పూర్తిగా చేజారిపోతుందని తేల్చిచెప్పారు.

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, బీఆర్ఎస్ నాయకత్వంపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు.తమ పార్టీ టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు తనపై వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తనను ఇలా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల వారికి ఏం వస్తుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే తనను ఇంటి నుంచి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని అన్నారు.గతంలోనూ తన ఆరోగ్యంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారని, తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ ప్రచారం చేశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తన నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం గతంలో కేసీఆర్ వద్దకు వెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఇరు వర్గాల మధ్య రాజకీయ విభేదాలు మరింతగా తీవ్రరూపం దాల్చాయి.

మరోవైపు, నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడాన్ని అందరూ ఐక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

ఏపీలో రేపు ఓటు పండుగ.. పల్లెలు, పట్టణాల్లో పోలింగ్ సందడి!

పల్లెల్లో పోలింగ్, లెక్కింపు నేడే..

గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ సందడి ఉదయం 7 గంటలకే మొదలుకానుంది. తొలి విడతలో మొత్తం 3,949 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, అందులో 758 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,191 సర్పంచ్ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుండగా, బరిలో 9,052 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 269 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, అన్నమయ్య జిల్లాలో అత్యధిక స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు.అలాగే 39,832 వార్డు సభ్యుల స్థానాలకు గాను 14,727 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 25,061 స్థానాల్లో 53,678 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పంచాయతీ పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, రేపు సాయంత్రానికే ఫలితాలు వెల్లడించనున్నారు. ఫలితాల ప్రకటన ముగిసిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా అక్కడికక్కడే నిర్వహిస్తారు. ఎక్కడైనా అనివార్య కారణాల వల్ల రీపోల్ అవసరమైతే నవంబర్ 27న నిర్వహిస్తారు.

నగరాలు, పురపాలికల్లోనూ ఓటింగ్

గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ రేపు ఎన్నికల వేడి కనిపించనుంది. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్లలో రేపు పోలింగ్ జరగనుంది. ఈ నాలుగు కార్పొరేషన్ల పరిధిలోని 260 వార్డుల్లో ఇప్పటికే రాజమహేంద్రవరంలో 2 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 258 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తున్నారు.

వీటితో పాటు ఆమదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు (నెల్లూరు), అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట వంటి 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. పట్టణ సంస్థల్లోని 750 వార్డుల్లో 39 ఏకగ్రీవం కాగా, మిగిలిన 711 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,801 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇక్కడ సుమారు 24.98 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. అయితే ఈ పట్టణ సంస్థల ఓట్ల లెక్కింపును మాత్రం నవంబర్ 30న చేపట్టనున్నారు.

పటిష్ఠ బందోబస్తు.. స్థానిక సెలవు

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం స్థానిక సెలవు ప్రకటించింది. పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు విడతల్లో జరుగుతుండగా, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2న నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది.

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పెట్టుబడుల రక్షణ చట్టం' (ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్) బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సమావేశాలు దాదాపు 15 రోజుల పాటు కొనసాగవచ్చని తెలుస్తోంది.రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక పెట్టుబడులకు రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా చట్టపరమైన భరోసా కల్పించడమే ఈ నూతన చట్టం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో అధికారం మారినప్పుడు... పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు, భూ కేటాయింపుల విషయంలో భవిష్యత్తులో విధానపరమైన ఆకస్మిక మార్పులు జరగకుండా నిరోధించేందుకు ఈ బిల్లును రూపొందిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు.

ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రికార్డు స్థాయిలో దాదాపు రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామికవేత్తల్లో మరింత నమ్మకాన్ని పెంచేందుకు ఈ చట్టాన్ని వేగంగా తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "చాలా మంది పెట్టుబడిదారులు దీనిపై మమ్మల్ని అడిగారు. ప్రభుత్వం దీనిపై తీవ్రంగా ఆలోచిస్తోంది, కచ్చితంగా చట్టం తెస్తాం" అని పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రంగా చర్చించనున్నారు.

ఏపీ సొంత రాబడి పెరిగింది..

- మొదటి పేజీ తరువాయి

ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ (సాయి ప్రసాద్)తో పాటు ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1,27,506 కోట్లు కాగా, నవంబర్ 23 నాటికే అందులో 58 శాతం మేర సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైంది. పన్ను ఆదాయం గతేడాది రూ.53,692 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.10,104 కోట్లు పెరిగి రూ.63,796 కోట్లకు చేరింది. అలాగే పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు ఎగబాకింది.

శాఖల వారీగా ఆదాయ వివరాలు:

వాణిజ్య పన్నులు: 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్ల మేర అదనపు ఆదాయం నమోదైంది. ఇందులో జీఎస్టీ ద్వారా వచ్చిన రాబడి 18.1 శాతం పెరిగి రూ.3,694 కోట్లకు చేరింది.

ఎక్సైజ్ శాఖ: స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.20,083 కోట్ల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే 19.6 శాతం వృద్ధితో రూ.3,287 కోట్లు అదనంగా సమకూరింది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు: 16.6 శాతం వృద్ధితో మొత్తం రూ.8,020 కోట్ల రాబడి వచ్చింది.

రవాణా శాఖ: వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా 17.3 శాతం వృద్ధి నమోదై రూ.3,649 కోట్ల పన్నుల ఆదాయం సమకూరింది.

గనులు, భూగర్భ శాఖ: 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు చేరింది.

అటవీ శాఖ: 22.3 శాతం పెరిగి రూ.22 కోట్ల ఆదాయం లభించింది.

స్థానిక సంస్థలు: ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీల పన్ను ఆదాయం రూ.238 కోట్లుగా, పట్టణ స్థానిక సంస్థల్లో రూ.2,365 కోట్లుగా నమోదైంది.

ప్రజలపై భారం మోపొద్దు: సీఎం చంద్రబాబు

సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండానే ప్రభుత్వ శాఖల్లో రాబడిని మరింత పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, లోపాలను సరిదిద్దడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకతను పెంచడం వల్లే ఆదాయంలో గణనీయమైన పురోగతి కనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం స్పష్టంగా ప్రతిబింబించేలా ఆదాయ వృద్ధి కొనసాగాలని అధికారులను ఆదేశించారు.

పన్ను వసూళ్ల వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ స్టాక్ వినియోగిస్తున్నామని.. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, క్షేత్రస్థాయి తనిఖీలు, న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారంలో సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

రాజకీయాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో భాగంగా తెలుగుదేశం పార్టీ మరో ముందడుగు వేసింది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆలోచనతో, పార్టీ కార్యకర్తలను అధిష్ఠానంతో అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'మైటీడీపీ' (వీఐఐపీ) యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షల మైలురాయిని అధిగమించింది. ఈ మేరకు టీడీపీ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది. దేశంలోని ప్రాంతీయ పార్టీల డిజిటల్ నిర్వహణలో ఇది ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

నారా లోకేశ్ విజన్ కు అనుగుణంగా ఈ డిజిటల్ వేదికను అభివృద్ధి చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే సాధారణ కార్యకర్తలను గుర్తించి, వారి సేవలకు తగిన అవకాశాలు కల్పించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది. గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలు నిర్వహించే కార్యకర్తలు తమ వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు. దీని ద్వారా కార్యకర్తల పనితీరును నేరుగా పరిశీలించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు, పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది.

ఈ యాప్ ద్వారా అధినేత సందేశాలు, పార్టీ మార్గదర్శకాలు త్వరితగతిన శ్రేణులకు చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయి సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇది ఉపయోగపడుతోంది. ఇటీవల నిర్వహించిన డిజిటల్ మహానాడుతో పాటు శిక్షణా తరగతులు, ఇతర సమావేశాల హాజరును కూడా ఈ వ్యవస్థ ద్వారానే పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా, పార్టీ నాయకులతో కార్యకర్తలు దిగిన ఫొటోలను సులభంగా పొందేందుకు వీలుగా 'ఫొటో బూత్' పేరిట ఫేస్ రికగ్నిషన్ సదుపాయాన్ని కూడా ఇందులో పొందుపరిచారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ వినియోగంలో పార్లమెంట్ విభాగంలో నరసరావుపేట, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు నియోజకవర్గాలు ముందంజలో ఉండగా.. అసెంబ్లీ విభాగంలో కుప్పం, వినుకొండ, కనిగిరి, మంగళగిరి, గన్నవరం నియోజకవర్గాలు అగ్రస్థానంలో నిలిచాయని పార్టీ ప్రకటన వివరించింది. ఆధునిక కాలంలో రాజకీయ వ్యవస్థను సాంకేతికతతో జోడించి, కార్యకర్తలే కేంద్రంగా పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ డిజిటల్ వేదిక ఒక కీలక సాధనంగా మారిందని తెలుగుదేశం పార్టీ పేర్కొంది.

జగన్ సీఎం పదవి అడిగారు..సోనియా నో చెప్పారు!

- మొదటి పేజీ తరువాయి

పలు అంశాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం అనంతరం, ముఖ్యమంత్రి పీఠం కోసం జగన్ తీవ్రంగా డిమాండ్ చేశారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అయితే జగన్ చేసిన ఆ అభ్యర్థనను అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పూర్తిగా నిరాకరించారని తెలిపారు. ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించకపోవడంతోనే, జగన్ పార్టీతో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేశారని విజయసాయిరెడ్డి వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అసలైన వెన్నుపోటుదారు ఎవరో వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆలోచించి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

గతంలో వైసీపీలో తన స్థానం గురించి మాట్లాడుతూ... పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టేందుకు తాను పడిన శ్రమ, చేసిన పోరాటాల ఫలితంగానే తనకు పార్టీలో నంబర్-2 స్థానం లభించిందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తన కష్టాన్ని గుర్తించి ఆ గుర్తింపు ఇచ్చారే తప్ప, ఎవరూ ఉచితంగా ఏమీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు తన ప్రస్తుత పార్టీ విధివిధానాలపై విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు. 1983లో తెలుగుదేశం పార్టీ అనుసరించిన ప్రజా విధానాలనే తమ పరివర్తన రాజనీతి పార్టీ కూడా అనుసరిస్తుందని ఆయన వెల్లడించారు. పీఆర్‌పీ ఎల్లప్పుడూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి మరియు సంక్షేమం కోసమే నిబద్ధతతో పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

సీఐఐనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

తాడిని తన్నే వాడుంటే.. వాడి తల తన్నే వాడొకడుంటాడన్నట్లుంది అమెరికా (ఖూూా) నిఘా సంస్థ సీఐఏ (జ×ూూ) పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని ఆ సంస్థ సేకరిస్తే.. ఆ సంస్థ కంప్యూటర్లలోకి చొరబడి హ్యాకర్లు డేటాను అపహరించారు. ఇందుకోసం వాడినట్లు భావిస్తున్న సైబర్ ఆయుధం చైనా తయారీగా అనుమానిస్తున్నారు. అబ్బే మా దగ్గర రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతిలో పడలేదని సీఐఏ చెబుతున్నా.. జరిగిన ఘటన అగ్రరాజ్యాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ), ది నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ది ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందో మాత్రం అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్య డేటా మాత్రం భద్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటీ చైనా ఆయుధం ఆర్టెక్స్..?

అమెరికా నిఘా సంస్థల కంప్యూటర్లలోకి చొరబడేందుకు చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్‌ను వాడారు. దాని పేరు ఆర్టెక్స్ (ఖూతీవఱ). ఈ ఏడాది ప్రారంభంలో ఓ చైనా ఇంజినీర్ దీనిని సైబర్ సెక్యూరిటీ కోసం అంటూ తయారు చేశాడు. జులై నుంచి బహిరంగంగా అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి జపాన్, దక్షిణ కొరియాలోని పలు వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు దీనిని వాడినట్లు ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరికాపై సైబర్ దాడులు చేస్తున్నారు.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌ను టార్గెట్ చేసి..

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా నుంచి సేకరించిన డేటా, ఉపగ్రహ చిత్రాలు, ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ హ్యాకర్ల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. తమకు చేరే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్‌జీఏ స్పందించలేదు.

దలైలామా విషయంలో ఏదో సస్పెన్స్.. సైలెంట్‌గా దిల్లీలో బంగ్లా కేటాయింపు..!

అమెరికా నిఘా సంస్థలకు ఏమైంది..?

ఇటీవల అమెరికా నిఘా, భద్రతా సంస్థల్లో తరచూ సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు చోటుచేసుకుంటున్నాయి. కొన్నాళ్ల క్రితం నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కీలక నెట్‌వర్క్ మొరాయించింది. అయితే ఇది సైబర్ దాడి కాదని ఎన్ఎస్ఏ తెలిపింది. ఇక అమెరికాలోని క్రిమినల్స్, అనుమానితుల డేటాను ఎఫ్‌బీఐ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి హ్యాకర్లు కాజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా ధ్రువీకరించారు. దీంతోపాటు గత వారం అమెరికా వ్యవసాయ శాఖపై కూడా సైబర్ దాడి జరిగింది.

గల్లంతైన కాకినాడ మత్స్యకారులు క్షేమం

కాకినాడ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక



పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

నేడు తొలి దశ పోలింగ్ -కందుకూరు మున్సిపాలిటీకి కూడా...
క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
పటిష్ట బందోబస్తు, నిఘా పెట్టామన్న ఎస్పీ

కందుకూరు పెన్ పవర్, నవంబర్ 25:

జిల్లాలో గురువారం జరిగే తొలి విడత పంచాయతీ ఎన్నికలకు, కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికలకు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ వి.హర్షవర్ధన రాజు, ఏ.ఎస్.పి. యుగంధర్, సబ్ కలెక్టర్ హిమవంశీలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

పోలింగ్ ఇలా....

మొదటి విడత పంచాయతీ ఎన్నికలలో 139 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇందులో 62 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన వాటికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 782 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారని, మిగిలిన 610 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలింగ్ సామాగ్రితో సిబ్బంది అందరూ బుధవారం సాయంత్రానికే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. కందుకూరు మున్సిపాలిటీకి సంబంధించి 40 వార్డులకుగాను 65 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో 47,400 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోబోతున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా జాయింట్ కలెక్టర్ , సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పంచాయతీ ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు జరుగుతాయని, అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. కందుకూరు మున్సిపాలిటీకి సంబంధించి ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీన స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సిసి కెమెరాల ద్వారా ప్రత్యక్ష వీక్షణ ఉంటుందన్నారు. మిగతా కేంద్రాలలో వీడియో రికార్డింగ్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫిర్యాదులు, సమస్యలు ఏమైనా ఉంటే 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏజెంట్లుగా ఉండే వారు ప్రత్యేకంగా పోలీస్ ఎన్ఓసి ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

బందోబస్తు ఇలా....

పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ వివరించారు. మున్సిపల్ ఎన్నికలకు దాదాపు 160 మంది సిబ్బందితో, పంచాయతీ ఎన్నికలకు దాదాపు 1180 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కందుకూరుకు సంబంధించి 9 అత్యంత సమస్యాత్మక, 13 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఇక్కడ అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ ఎన్నికలకు కూడా అదనపు ఎస్పీ అధికారిని పర్యవేక్షణ కోసం పెట్టామన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం జిల్లాలో ఉన్న డీఎస్పీలు, ఇన్స్పెక్టర్స్ అందరినీ విధులకు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి. బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం



నామినేషన్ల తిరస్కరణ పై రాజకీయ దుమారం...

అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం
అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారా?
పోలీసుల తీరుపైనా విమర్శలు

పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 25

పుల్లల చెరువు మండలం ఎండ్రపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. పరిశీలన సమయంలో ఆర్ఓ అత్యుత్సాహం ప్రదర్శించి వైసీపీ సర్పంచ్ అభ్యర్థలకు సంబంధించిన నామినేషన్ పత్రాలను తిరస్కరించారంటూ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ల పరిశీలనలో అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో గ్రామంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నిబంధనల పేరుతో తమ నామినేషన్లను తిరస్కరిస్తూ, అధికార పార్టీకి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారని సర్పంచ్ అభ్యర్థి చిరదల అశోక్ ఆరోపించారు. ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి పక్షపాత ధోరణితో అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అధికారులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారా.. లేక అధికార పార్టీ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారా అంటూ ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో సమాన న్యాయం అందరికీ వర్తించాల్సిందేనని, తమకు జరిగిన అన్యాయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక పోలీసుల వ్యవహారశైలిపైనా గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తూ తమ అభ్యంతరాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అధికారులు, పోలీసులే ఒకవైపు నిలుస్తున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నామినేషన్ పత్రాలు తిరస్కరించడంతో పోలీసులు తీరు పై గ్రామస్తులు ధర్నాకు దిగి ఆందోళన చేశారు. ఈ వ్యవహారం వెనుక మల్లపాలెం గ్రామానికి చెందిన ఓ నాయకుడు అధికారులను ప్రభావితం చేస్తూ తెరవెనుక వ్యవహారాలు నడిపిస్తున్నారంటూ ఎండ్రపల్లి గ్రామస్తులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా ఎండ్రపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకుడు సైతం అధికార పార్టీ నాయకులకు మద్దతుగా నిలుస్తున్నారనే అభిప్రాయాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. దీంతో ఎండ్రపల్లిలో నామినేషన్ల పరిశీలనవ్యవహారం కేవలం ఎన్నికల ప్రక్రియకే పరిమితం కాకుండా రాజకీయ వివాదంగా మారింది. నామినేషన్ల పరిశీలనలో ఏ నిబంధనల ఆధారంగా నామినేషన్ పత్రాలను తిరస్కరించారు? అభ్యర్థి అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారా? అధికారులపై వస్తున్న పక్షపాత ఆరోపణలకు ఎన్నికల యంత్రాంగం స్పందిస్తుందా? అన్న ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాల్సిన తరుణంలో ఇలాంటి వివాదాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య ప్రక్రియపై సందేహాలకు తావిస్తోంది. ఈ ఘటనపై గ్రామస్తులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించి తమ అభ్యంతరాలను వివరించినట్లు తెలిపారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో ఎండ్రపల్లి నామినేషన్ల వివాదంపై ఉన్నతాధికారుల విచారణ ఎలా సాగుతుంది? గ్రామస్తులకు న్యాయం జరుగుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఉయ్యాలవాడలో అర్ధరాత్రి వరి గడ్డి వామికి నిప్పు

ఏలినో ప్రభావంతో కరువు పరిస్థితులు.. పశుగ్రాసం
దొరకడమే కష్టంగా ఉన్న వేళ అగ్నికి ఆహుతైన గడ్డి వామి

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25



గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వరి గడ్డి వామికి నిప్పు పెట్టారు. రైతు ఖాదర్ బాషాకు చెందిన గడ్డి వామి ఈ ఘటనలో పూర్తిగా దగ్ధమైంది. ప్రస్తుతం ఏలినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొని పశుగ్రాసం సేకరించడం కూడా రైతులకు కష్టంగా మారింది. ఇలాంటి క్లిష్ట సమయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గడ్డి వామికి నిప్పు పెట్టడం అత్యంత బాధాకరమని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఘటనలో సుమారు రూ. 60 వేల విలువైన పశుగ్రాసం కాలిపోయి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, అందులో ఉన్న నీరు సరిపోక అయిపోవడంతో మంటలను పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోయారని, తిరిగి నీటిని తీసుకువచ్చేలోపే గడ్డి వామి పూర్తిగా దగ్ధమైందని బాధితుడు తెలిపాడు. కష్టకాలంలో పశువుల మేత కోసం ఎంతో శ్రమించి సేకరించిన గడ్డి కళ్లముందే కాలిపోవడంతో రైతు కుటుంబం లబోదిబోమంటోంది. కరువు పరిస్థితుల్లో ఇలాంటి ఘటన జరగడం తమకు తీరని నష్టాన్ని మిగిల్చిందని ఖాదర్ బాషా ఆవేదన వ్యక్తం చేశాడు.



జయరంపురంలో గుక్కెడు నీటి కోసం కష్టాలు!

ట్యాంక్ వద్ద మహిళల మధ్య వాగ్వాదాలు..
నీటి కోసం బిందెలతో బారులు..!
జయ రాం పురం లో నీటి కష్టాలు ..
ఎల్‌నినో ప్రభావంతో అడుగంటిన భూగర్భ జలాలు..
రెండు బిందెల నీటి కోసం తప్పని తిప్పలు!



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25

గిద్దలూరు మండలం జయరాం పురం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టం పడిపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు బిందెలతో ట్యాంకర్ల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండు నెలలుగా గ్రామంలో తీవ్ర నీటి కొరత ఏర్పడటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రెండు బోర్లు ఉండగా, ఒక బోరు చెడిపోవడంతో పనిచేయడం లేదని, మరో బోరులో కూడా నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాలెం సమీపంలోని ఉన్న ట్యాంక్ వద్ద నీటి కోసం బిందెలు బార్లు తీరాయి. బార్లు గా ఉన్న రెండు బిందెల నీరు మాత్రమే అందుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని పాలెంకు ఒకరోజు, ప్రధాన గ్రామానికి ఇంకొకరోజు చొప్పున నీటిని సరఫరా చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి కోసం ఒక్కసారిగా బిందెలతో ప్రజలు ట్యాంక్ వద్ద బారులు తీరడంతో అక్కడ రద్దీ నెలకొంది. రోజువారీ అవసరాలకు సరిపడా నీరు లభించక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు మానుకొని నీటి కోసం ఇక్కడే పడి గాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించడంతో పాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేయాలని, ట్యాంకర్ల ద్వారా సరిపడా నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమ నీటి కష్టాలను అధికారులు వెంటనే పరిష్కరించాలని జయరాంపురం ప్రజలు కోరుతున్నారు.



స్థానిక ఎన్నికలలో ఆదర్శంగా నిలిచిన కొమ్మాలపాడు

మంత్రి గొట్టిపాటి సహకారంతో అభివృద్ధికి బాటలు.. ఎంపీపీ నుంచి సర్పంచి, వార్డు సభ్యుల వరకు ఏకగ్రీవం

రాజకీయ విభేదాలకు స్వస్తి.. గ్రామ ప్రజల ఐక్యతకు ఇప్పుడు అభివృద్ధి పరీక్ష!

సంతమాగులూరు, పెన్ పవర్, నవంబర్ 25,

గ్రామాభివృద్ధి లక్ష్యంగా రాజకీయ విభేదాలను పక్కనపెట్టి కొమ్మాలపాడు గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. కొమ్మాలపాడు చరిత్రలో ఏకగ్రీవ ఎన్నికలు జరగడం కూడా ఇదే మొట్టమొదటిసారి కావడం ఒక ప్రత్యేకత . గ్రామస్తుల ఐక్యత, మంత్రి సహకారం, గ్రామాభివృద్ధి అనే మూడు ప్రధాన అంశాలతో సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామం రాజకీయాలకు కొత్త సందేశాన్ని ఇచ్చింది. మండల పరిషత్ అధ్యక్ష పదవి నుంచి గ్రామ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల వరకు ఏకగ్రీవం కావడం ఆ గ్రామ ఐక్యత కరదర్శనం.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొమ్మాలపాడు గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని, అద్దంకి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి మండల పరిషత్ అధ్యక్ష పదవిని అందిస్తామని ఇచ్చిన హామీ గ్రామంలో ఐక్యతకు పునాది వేసింది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో కొమ్మాలపాడుకు చెందిన మోతాదు బాషా 2300 కు పైగా ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. గ్రామస్తుల సమష్టి మద్దతుతో ఆయన ఎంపీపీ పీఠాన్ని అధిరోహించేందుకు మార్గం సుగమమైంది. అందుకే మాతాద్ భాషా ఎంపీపీ పదవ పై ఆశీనులయ్యారు.





నెల తిరగకముందే మరోసారి ఐక్యత చాటింపు

మండల పరిషత్ ఎన్నికల్లో ప్రదర్శించిన ఐక్యతను నెల తిరగకముందే జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామస్తులు కొనసాగించారు. సర్పంచి అభ్యర్థిగా వయ్యకంటి మస్తాన్‌వలి (హుక్కు)తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా నిలబెట్టుకోవడం కొమ్మాలపాడు గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. సుమారు 4 వేల మంది ముస్లిం జనాభా కలిగిన ఈ గ్రామంలో రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ ప్రయోజనాలే ప్రధాన అజెండాగా మారడం విశేషం.

విభేదాల కంటే మిత్రత్వమే మేలు

కొమ్మాలపాడులో బలమైన రాజకీయ ప్రాతినిధ్యం కలిగిన వామపక్షాలు, ముఖ్యంగా సీపీఐ నాయకులు సైతం గ్రామాభివృద్ధి విషయంలో సానుకూలంగా వ్యవహరించడం మరో విశేషం. గత ఎంపీటీసీ ఎన్నికల్లో సీపీఐ తరపున పోటీ చేసిన కాలేషావలి, మోతాదు బాషా విజయానికి సహకరించడమే కాకుండా, తాజా పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామ ఐక్యతకు మద్దతు తెలపడం అభినందనీయం. రాజకీయంగా భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధి విషయంలో అందరూ ఒకే మాటపై నిలబడటం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సంప్రదాయానికి నిదర్శనం.

ఐక్యత సాధించారు.. ఇక అభివృద్ధి సాధించాలి!

కొమ్మాలపాడు గ్రామస్తులు ఎన్నికల్లో సాధించిన ఐక్యత ఒక గొప్ప ముందడుగు మాత్రమే. అసలైన పరీక్ష ఇప్పుడు ప్రారంభం కానుంది. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తమపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి చెల్లించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల సమయంలో ఏర్పడిన ఐక్యత పాలనలోనూ కొనసాగితేనే గ్రామానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్యం, వీధిలైట్లు, విద్యా సదుపాయాలు, ఆరోగ్య సేవలు వంటి ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుబాటు వంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సర్పంచి, వార్డు సభ్యులు గ్రామ అవసరాలను గుర్తించి ప్రాధాన్యతల వారీగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. గ్రామసభలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించాలి. పంచాయతీకి వచ్చే నిధులు, ప్రభుత్వ పథకాల కేటాయింపులు, చేపట్టే పనుల వివరాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. ప్రతి పనికి స్పష్టమైన లక్ష్యం, నాణ్యతా ప్రమాణాలు, గడువు ఉండేలా పర్యవేక్షించాలి. గ్రామంలోని అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ అందేలా చర్యలు తీసుకోవాలి.

మంత్రి హామీని అభివృద్ధి ఫలాలుగా మార్చాల్సిన సమయం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇచ్చిన సంపూర్ణ సహకారం హామీ కొమ్మాలపాడుకు ఒక గొప్ప అవకాశంగా చెప్పవచ్చు. అయితే ఆ హామీని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజాప్రతినిధులపైనే ఎక్కువగా ఉంటుంది. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను సిద్ధం చేసి, అంచనాలతో కూడిన ప్రతిపాదనలను మంత్రికి అందించాలి. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిధులు, అనుమతులు తీసుకురావడంలో చొరవ చూపాలి.మండల పరిషత్ అధ్యక్షుడిగా మోతాదు బాషా తన పదవిని కేవలం రాజకీయ గుర్తింపుగా కాకుండా కొమ్మాలపాడుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలి. మండల పరిషత్ నిధులు, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామానికి అదనపు ప్రయోజనాలు చేకూర్చేందుకు కృషి చేయాలి. సర్పంచి మస్తాన్‌వలి, వార్డు సభ్యులు స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలి. మంత్రి సహకారం, ఎంపీపీ స్థాయిలో ఉన్న రాజకీయ అవకాశాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయం కలిస్తే కొమ్మాలపాడు అభివృద్ధిలో ఆదర్శ గ్రామంగా ఎదిగే అవకాశం ఉంది.

రాజకీయ ఐక్యతకు అభివృద్ధే అసలైన కొలమానం!

ఎన్నికల సమయంలో ప్రత్యర్థులుగా ఉన్నవారు గ్రామ ప్రయోజనాల కోసం ఒకే నిర్ణయానికి రావడం కొమ్మాలపాడు ప్రత్యేకత. అయితే ఈ ఐక్యత ఎన్నికల వరకే పరిమితం కాకూడదు. అభివృద్ధి పనుల ఎంపిక, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి ప్రతి అంశంలోనూ ఇదే సమన్వయం కొనసాగాలి. ఏకగ్రీవంగా ఎన్నికయ్యామనే భావనతో ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ఏకగ్రీవం ద్వారా లభించిన బాధ్యతను మరింత జవాబుదారీతనంతో నిర్వహించాలి.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం కొమ్మాలపాడు చాటిన ఐక్యత ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. సుమారు నాలుగు వేల మంది ముస్లిం జనాభా కలిగిన ఈ గ్రామం రాజకీయ విభేదాలను అధిగమించి సమష్టి నిర్ణయం తీసుకోవడం అభినందనీయ పరిణామం. అయితే ఇప్పుడు గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించడం, పేదలకు సంక్షేమ ఫలాలు అందించడం వంటి అంశాల్లో ఫలితాలు చూపించాల్సి ఉంది. మొత్తంగా కొమ్మాలపాడు ఎన్నికల్లో ఐక్యతను సాధించింది.. ఇప్పుడు అభివృద్ధిలోనూ అదే స్ఫూర్తిని నిరూపించుకోవాలి. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం ఒక అవకాశమైతే, దానిని సద్వినియోగం చేసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత. గ్రామస్తులు అందించిన ఏకగ్రీవ తీర్పు ఒక పదవి కోసం ఇచ్చిన మద్దతు మాత్రమే కాదు.. గ్రామ భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలకు ప్రతిరూపం. ఆ నమ్మకాన్ని నిలబెట్టి కొమ్మాలపాడును అభివృద్ధికి చిరునామాగా మార్చినప్పుడే ఈ చారిత్రాత్మక ఐక్యతకు నిజమైన సార్థకత చేకూరుతుంది.

నూతన వధువును ఆశీర్వదించిన దివి రవీంద్రనాథ్



కందుకూరు పెన్ పవర్, నవంబర్ 25

పట్టణంలోని కోవూరు రోడ్డు లో గల ఆదినారాయణ రెడ్డి నగర్ నివాసి పువ్వాడి వెంకటేశ్వర్లు , పద్మ దంపతుల కుమార్తె సాయి ప్రియ వివాహ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ కార్యక్రమంలో రవీంద్రనాథ్ వెంట కందుకూరు ఏఎంసి మాజీ చైర్మన్ తలపనేని వెంకటేశ్వర్లు, గద్దం కొండయ్య, గుమ్మళ్ళ వెంకట్రావు, తలపనేని నరసింహారావు, కాకర్ల మల్లికార్జున రావు, దివి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువును ఆశీర్వదించిన దివి రవీంద్రనాథ్



కందుకూరు పెన్ పవర్, నవంబర్ 25

పట్టణ పరిధిలోని చుట్టుగుంట గ్రామ వాస్తవ్యులు కవల ప్రసాద్ , సుశీల దంపతుల కుమారుడు వినయ్ కుమార్ మరియు గాయత్రి ప్రభ వివాహం ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో జరగగా బుధవారం చుట్టుగుంట గ్రామంలో ప్రసాద్ నివాసం నందు సత్యనారాయణ వ్రతం ఏర్పాటు చేయగా తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కోగంటి శ్రీనివాసరావు, మాదాల మోహన్, ముప్పరాజు శ్రీహరి, కాకర్ల మల్లికార్జునరావు, తలపనేని నరసింహారావు, దివి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొని నూతన వధూవరులకు అక్షంతలు వేసి ఆశీర్వదించారు.

ముస్లింలకు వైస్ చైర్మన్ పదవి ఇవ్వకపోవడం అన్యాయం

కాలేబు మాదిగ



మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 25

మార్కాపురం పట్టణంలో అత్యధిక జనాభా, అధిక ఓట్లు కలిగిన ముస్లింలకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇవ్వకపోవడం అన్యాయమని దళిత ఉద్యమ నేత సంద్రపాటి కాలేబు మాదిగ ఓ ప్రకటన ద్వారా ఖండించారు. మార్కాపురం మున్సిపాలిటీలో అత్యధిక జనాభా కలిగిన ముస్లిం మైనారిటీలను పూర్తిగా విస్మరించడం దారుణమని అన్నారు.ఇప్పటికైనా జిల్లాలో అర్బన్ డెవలప్మెంట్ లోనైనా ముస్లిం మైనారిటీలకు స్థానం కల్పించాలని, వారి మనసు గెలుచుకునే విధంగా కూటమి నాయకులు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.ముస్లిం మైనారిటీలకు దళితుల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా కాలేబు మాదిగ స్పష్టం చేశారు.

రైతులకు పంటల బీమా తప్పనిసరి

- మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా

సంతమాగులూరు, పెన్ పవర్, నవంబర్ 25

మండలంలోని ఎల్చూరు, మక్కెనవారిపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా రైతులకు పలు కీలక సూచనలు చేశారు.రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని షేక్ సైదా సూచించారు. ఎఫ్ఎఫ్ఎస్ విధానం ద్వారా ఎరువులు పొందే విధానాన్ని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చైతన్య, వీఏఏ ప్రగతి, ఎంపీఈఓలు రామాంజి, జానీబాషా, రైతులు పాల్గొన్నారు.



మైనార్టీల పట్ల బహిర్గతమైన టీడీపీ వివక్ష

సయ్యద్ గౌస్ మోహిద్దీన్



మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 25:

అణగారిన వర్గాల ఓట్లు తీసుకుని వారిని వంచించడం తమ నైజమని టీడీపీ సర్కార్ మరోసారి రుజువు చేస్తుందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. మైనార్టీలను అనునిత్యం మోసం చేస్తూ వస్తున్న పార్టీ టీడీపీ అని ఆయన ధ్వజమెత్తారు.గత ఎన్నికల్లో మైనార్టీలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిన కూటమి సర్కార్ తాజాగా మున్సిపల్ ఎన్నికల్లో మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు.మార్కాపురం పట్టణ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా ముస్లింలను ఎంపిక చేయడం అనవాయితీగా వస్తోందని, వాటిని తుంగలో తొక్కి ముస్లింలను తాజాగా కూటమి సర్కార్ మోసం చేసిందని అన్నారు. ముస్లింలకు అవకాశం ఇవ్వకుండా ఇతరులకు అవకాశం కల్పించడం టీడీపీ మోసపూరిత విధానానికి నిదర్శనమన్నారు. తమ హయాంలో షాదీఖానా నిర్మాణ పనులు చేయాలని నాడు కెమెరాలు పట్టుకుని షాదీఖానా చుట్టూ ప్రదక్షిణలు చేసిన జనసేన నాయకులు ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి సర్కార్ పాలిస్తున్నా షాదీఖానా నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేకపోయారని జనసేన, టీడీపీ నేతలను నిలదీశారు.చంద్రబాబు ప్రతిసారి ముస్లిం మైనార్టీలను మోసం చేయడం అలవాటుగా చేసుకున్నారని విమర్శించారు. ముస్లింలకు న్యాయం చేసింది దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు.వైఎస్ జగన్ ముస్లింలకు అనేక ఎమ్మెల్యే సీట్లు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడమే కాకుండా మున్సిపాలిటీల్లో, పంచాయతీల్లో పెద్ద ఎత్తున చోటు కల్పించారని వెల్లడించారు. ఒకసారి వైసీపీ పాలనను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ముస్లింలు టీడీపీ సర్కార్ చేసిన ద్రోహాన్ని గుర్తించి మరోసారి వైసీపీని బలంగా బలపరచాలని పిలుపునిచ్చారు. వైసీపీతోనే రాష్ట్రంలోని ముస్లింల భవిష్యత్తు ముడిపడి ఉందని, ఏపీలో రాబోయేది వైసీపీ సర్కారేనని, అప్పుడే ముస్లింలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కార్తీక పౌర్ణమి వేడుకల్లో టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి





గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25

గిద్దలూరు పట్టణంలోని శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్వామివారి జ్వాలా తోరణం, పల్లకీ సేవ, పంచహారతి కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి పంచహారతి కార్యక్రమంలో స్వయంగా అగ్ని సేవ నిర్వహించి, స్వామివారి పల్లకీని మోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారన్నారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. గిద్దలూరు పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్ లు, వార్డు నాయకులు, భక్తులు తదితరులు పాల్గొని స్వామి వారి దివ్యాసుశీస్సులు పొందినారు.

నైట్ కోర్టులపై న్యాయవాదుల ఆగ్రహం

మార్కాపురం కోర్టు సెంటర్‌లో రాస్తా రోకో

మార్కాపురం పెన్ పవర్ నవంబర్ 25:

న్యాయ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మార్కాపురంలో న్యాయవాదులు రోడ్డెక్కారు.దేశవ్యాప్తంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే నెపంతో విశ్రాంత న్యాయమూర్తులతో నైట్ షిఫ్ట్ కోర్టులను ప్రస్తుతం 3 రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ నేడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కాపురం కోర్టు సెంటర్‌లో రాస్తా రోకో నిర్వహించారు.కోర్టు సెంటర్ వద్ద బైఠాయించిన న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెండింగ్ కేసులు తగ్గించాలంటే ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలే తప్ప, రాత్రిపూట కోర్టులు పెట్టడం పరిష్కారం కాదని మండిపడ్డారు.రాత్రివేళ కోర్టులు మహిళా న్యాయవాదులకు, కక్షిదారులకు, సాక్షులకు ప్రమాదకరమని, న్యాయవాదుల కుటుంబ జీవితాన్ని దెబ్బతీస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైట్ కోర్టులు న్యాయవాద వృత్తిని బలహీనపరిచే కుట్ర అని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.నైట్ కోర్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి మార్కాపురం బార్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని న్యాయవాదులు స్పష్టం చేశారు.



జంగంగుంట్ల ఆంజనేయస్వామి దేవస్థానంలో

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు





మార్కాపురం పెన్ పవర్, నవంబర్ 25:

కంభం మండలంలోని జంగంగుంట్ల శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. చల్ల సత్యం కుమారుడు రజనీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా దీపకాంతులతో, పూల అలంకరణతో శోభాయమానంగా మారింది. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి అంటేనే భక్తికి, దీపానికి ప్రతీక అని అన్నారు. జంగంగుంట్ల ఆంజనేయస్వామి దేవస్థానం ఈ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా, నమ్మకానికి నిలయంగా నిలిచిందని తెలిపారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.యువత ఆధ్యాత్మికత వైపు మళ్లడం, గ్రామాల్లో ఐక్యత, భక్తి భావం పెరగడం ఎంతో సంతోషంగా ఉందని, అందరూ కలిసి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని రజనీకాంత్ పేర్కొన్నారు. స్వామివారి కృపతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్

పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘ చర్చ



అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) నవంబర్ 25:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల (పంచాయతీ) ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే అంశంతో పాటు, నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగింది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అశోక్ కుమార్‌కు పార్టీ అధినేత దిశానిర్దేశం చేశారు.

గ్రామపంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.. ఎస్పీ





స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ నవంబర్ 25

బుధవారం జిల్లా కలెక్టర్ పి. రాజబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తో కలిసి టంగుటూరు లక్ష్మీ శ్రీనివాస కళ్యాణం మండపంలో ఏర్పాటు చేసిన రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు– 2026 కు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన వసతుల గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఏ బస్సులు ఎటు పోతున్నది తదితర విషయాలు దగ్గరుండి పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి చిరంజీవి, మండల అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు.

సురవారిపల్లె సర్పంచిగా ఇసుకల మరియమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక



కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం సూరివారిపల్లి సర్పంచిగా ఇసుకల మరియమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ ప్రకటించారు. సూరవారి పల్లె సర్పంచ్ పదవికి పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా, వారిలో మంగళవారం తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఇసుకల మరియమ్మ తప్ప మిగిలిన అభ్యర్థులందరూ తమనామినేషన్లను ఉపసంహరించుకున్నారని, దీనితో సురవారిపల్లి సర్పంచిగా ఇసుకల మరియమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించామని ఆర్ఓ తెలిపారు. సురవారిపల్లె సర్పంచ్ గా ఎన్నికైన మరియమ్మకు కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మండలాధ్యక్షురాలు బోనేని రమణమ్మ,వీరం రెడ్డిశంకర్ రెడ్డి, మాదాల పుల్లయ్య, బాలిరెడ్డి తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

కొమరోలు మండలంలో 12 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం

అల్లినగరం,రెడ్డి చర్ల గ్రామపంచాయతీల సర్పంచ్ పదవులకు ఎన్నికలు అనివార్యం

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలంలో గల 14 గ్రామ పంచాయతీలలోని 12 గ్రామపంచాయతీలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి మరో రెండు పంచాయతీలకు ఈనెల 29న ఎన్నికల నిర్వహించనున్నట్లుగా కొమరోలు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి,స్థానిక ఎంపీడీవో పి రమేష్ బాబు తెలిపారు. కొమరోలు మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా వాటికి ఈనెల 29న ఎన్నికలు జరగవలసి ఉన్నాయి. అయితే నామినేషన్ ఉపసంహరణ సందర్భంగా పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో కొమరోలు, బ్రాహ్మణపల్లి, సూరవారిపల్లి, బాదినేనిపల్లి, ఇడమకల్లు, ముక్తాపురం, రాజుపాలెం, దద్దవాడ,తాటిచెర్ల, నల్లగుంట్ల, పుల్లారెడ్డిపల్లి, చింతలపల్లి గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సదరు 12 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు, ఉప సర్పంచ్ పదవులకు, వార్డు పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు,కాగా మిగిలిన అల్లినగరం,రెడ్డి చర్ల గ్రామపంచాయతీల ఎన్నికల బరిలో ఒకరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉండటంతో సదరు రెండు గ్రామపంచాయతీలకు



ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నెల 29వ తేదీన అల్లినగరం, రెడ్డిచర్ల గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహించవలసి ఉన్నదని ఆయన తెలిపారు అల్లినగరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీలో ఉన్న బొండిగల వెంకటసుబ్బయ్యకు మంచం గుర్తు కేటాయించామని, పోటీలో ఉన్న మరో అభ్యర్థి షేక్ సత్తార్ కు కత్తెర గుర్తు కేటాయించామని ఎంపీడీవో తెలిపారు ఇక రెడ్డి చర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని,వారిలో అక్కల రెడ్డి తిరుమల జ్యోతి కి మంచం గుర్తు, చెన్నమరాజు ధనలక్ష్మి కత్తెర గుర్తు,రెడ్డి చర్ల రామలక్ష్మమ్మకు ఉంగరం గుర్తు,అక్కల రెడ్డి వరుణకు బుట్ట గుర్తు కేటాయించినట్లుగా ఆయన వివరించారు. సదరు రెండు గ్రామపంచాయతీల వార్డు సర్పంచ్ పదవులకు ఈనెల 29వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి సాయంత్రం మూడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామని అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని రమేష్ బాబు తెలిపారు.

ముస్లింలకు వైస్ చైర్మన్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం

మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 25

మార్కాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవిని ముస్లింలకు ఇవ్వకపోవడంపై ముస్లిం మత పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంభం సెంటర్‌లోని జామియా మసీదులో మత పెద్దలు, కార్యవర్గ సభ్యులు భారీ ఎత్తున సమావేశమై చర్చించారు. పట్టణంలో అత్యధిక మెజార్టీ ఓటర్లుగా ఉన్న ముస్లిం మైనార్టీలకు గత 40 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వైస్ చైర్మన్ పదవి కేటాయిస్తున్నారని గుర్తుచేశారు. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ముస్లింలకే ఈ పదవి ఇచ్చారని తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో 40 వార్డుల్లో 10 వార్డుల్లో ముస్లింలు కౌన్సిలర్లుగా గెలిచారని, అందులో జనసేన, టీడీపీకి చెందిన ముస్లిం మైనార్టీ కౌన్సిలర్లు 10 మంది ఉన్నారని తెలిపారు. అయినా కనీసం వైస్ చైర్మన్ పదవి కూడా కల్పించకుండా కూటమి ప్రభుత్వం ముస్లిం కమ్యూనిటీని మోసపూరితంగా అన్యాయం



చేసిందని మండిపడ్డారు.ఇప్పటికైనా జిల్లాలో ముస్లిం సోదరులకు స్థానం కల్పించాలని, జిల్లా అర్బన్ డెవలప్మెంట్‌లో ముస్లింలకు స్థానం కేటాయించాలని ముస్లిం మత పెద్దలు కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

దద్దవాడ గ్రామ సర్పంచ్ గా బిజ్జం రవీంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం దద్దవాడ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ గా బిజ్జం రవీంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దద్దవాడ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పలువురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా వారిలో మంగళవారం తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి బిజ్జం రవీంద్రారెడ్డి తప్ప మిగిలిన అభ్యర్థులందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని దీనితో దద్దవాడ గ్రామపంచాయతీ సర్పంచిగా రవీంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికైన రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రవీంద్రారెడ్డి దద్దవాడ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎగగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణ కిషోర్ రెడ్డి



కొమరోలు మండలాధ్యక్షురాలు బోనేని రమణమ్మ ఉపాధ్యక్షులు తిరుమల్ రెడ్డి కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ దద్దవాడ ఎంపిటిసి సభ్యులు బిజ్జం వెంకట్రామిరెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు వ్యక్తం చేస్తూ రవీంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొమరోలు మండల అధ్యక్షురాలు బోనేని రమణమ్మ తదితర నేతల సహాయ సహకారాలతో దద్దవాడ గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని రవీంద్రారెడ్డి తెలిపారు. దద్దవాడ గ్రామపంచాయతీ కి నూతన సర్పంచిగా ఎన్నికైన రవీంద్రారెడ్డి కొమరోలు మండలం ఎడమకలు సహకార సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

ప్రపంచ మేయర్ల సదస్సులో నగర మేయర్ నల్లమల్లి శ్రీ శిల్ప



ఒంగోలు టౌన్, పెన్ పవర్ నవంబర్ 25

ప్రపంచ మేయర్ల సదస్సులో ఒంగోలు నగరానికి గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కింది. ముంబైలోని హోటల్ ఫెయిర్‌మాంట్‌లో నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ మేయర్ల సదస్సు, 7వ ఆసియా నగరాల సదస్సు కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ నల్లమల్లి శ్రీ శిల్ప పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ , ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర చైర్మన్ కొమిరెడ్డి పట్టాభి తో కలిసి శ్రీ శిల్ప పాల్గొని వివిధ నగరాల మేయర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణాభివృద్ధి రంగ నిపుణులతో మమేకమయ్యారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో పట్టణ పాలన, ఆధునిక మౌలిక సదుపాయాలు, సుస్థిర నగరాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు మెరుగైన పౌరసేవలు వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఒంగోలు నగరాన్ని ఆధునిక అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రపంచస్థాయి పట్టణాభివృద్ధి ఆలోచనలు, నూతన పాలనా విధానాలను తెలుసుకునే ఈ అంతర్జాతీయ వేదిక ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒంగోలు నగర ప్రాతినిధ్యం అభివృద్ధి దిశగా మరో ముందడుగు కు శ్రీకారం.

పాలకవీడు సర్పంచ్ బరిలో తోడికోడళ్లు!



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25

రాచర్ల మండలం పాలకవీడు గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు తోడికోడళ్లు సర్పంచ్ పదవి కోసం ఎన్నికల బరిలో నిలిచారు.టిడిపి మద్దతు అభ్యర్థిగా బద్దీటి అల్లోపోన్స్ 'మంచం'గుర్తుపై పోటీ చేస్తుండగా, వైసిపి మద్దతు అభ్యర్థిగా బద్దీటి సమాధానమ్మ 'కత్తెర' గుర్తుతో తలపడుతున్నారు. ఒకే ఇంటికి చెందిన ఇద్దరు మహిళలు ప్రత్యర్థులుగా పోటీ పడుతుండటంతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

నల్లగుంట్ల సర్పంచ్‌గా పంకు అరుణకుమారి, ఉప సర్పంచ్ గా చెన్నారెడ్డి భూలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక





కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ గా పంకు అరుణకుమారి ఉపసర్పంచిగా చెన్నారెడ్డి భూలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి రమేష్ బాబు తెలిపారు. నల్లగుంట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేసిన అభ్యర్థులలో నామినేషన్ ఉపసంహరణ రోజైన మంగళవారం పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని దీనితో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి పంకు అరుణకుమారి నల్లగుంట్ల గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు అనంతరం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలలో చెన్నారెడ్డి భూలక్ష్మి ఉప సర్పంచ్ గా యోగ్యంగా ఎన్నికైనట్లుగా ఆర్ఓ ప్రకటించారు. అలాగే ఆ గ్రామపంచాయతీ పరిధిలోని వార్డు మెంబర్లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. సర్పంచ్ ఉప సర్పంచ్ పదవిలోకి ఎన్నికైన అభ్యర్థులకు వార్డు పదవుల అభ్యర్థులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గిద్దలూరులో సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ఉచిత ఉద్యోగ మేళాకు భారీ స్పందన.. 74 మందికి

వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు!



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25

గిద్దలూరు పట్టణంలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరై ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. మొత్తం 74 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రంగస్వామి రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యంగా కళాశాల ముందుకు సాగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని జాబ్ మేళాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన సూచించారు.

గిద్దలూరు మండలం లో రెండు పంచాయతీలు ఏకగ్రీవం!



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 25

గిద్దలూరు మండలం లోని 19 గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో రెండు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కొంగలవీడు, ఆదిమూర్తిపల్లి గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు స్థానాలన్నీ ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 17 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 50 మంది అభ్యర్థులు, 277 వార్డు స్థానాలకు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.వి. మోహన్ కుమార్ వెల్లడించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

పొదిలి, పెన్ పవర్, నవంబర్ 25

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పంకజ్ కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం నాడు పొదిలి పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ మరియు ఎన్నికల సామాగ్రి పంపి ణీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి భద్రత ఏర్పాట్లును పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలను సిబ్బందికి అందజేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో జరగాలని, అందుకు భిన్నంగా జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి పంకజ్ కుమార్ మీనా వెంట ఓ ఎస్ డి నవ జ్యోతి మిశ్రా, పొదిలి నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్, పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. రాజేష్ కుమార్, ఎస్ ఐ సూరెడ్డి రాజేష్, కొడకనమెట్ల ఎస్ ఐ శ్రీకాంత్ తోపాటు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి చర్ల సర్పంచ్ పదవికి పోటీపడుతున్న నలుగురు మహిళా అభ్యర్థులు

12 వార్డులలో 12 వ వార్డు ఏకగ్రీవం. మిగిలిన11 వార్డులకు పోలింగ్.









కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం రెడ్డి చర్ల సర్పంచ్ పదవికి నలుగురు మహిళా అభ్యర్థులు పోటీలో నిలిచారు. రెడ్డి చర్ల సర్పంచ్ పదవికి ఓసి మహిళకు కేటాయించడంతో ఆ పదవికి వైసిపి బలపరిచిన నలుగురు అభ్యర్థులు తెలుగుదేశం పార్టీ బలపరిచిన నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అయితే నామినేషన్ ఉపసంహరణ గడువు సందర్భంగా మంగళవారం ఇరు వర్గాలకు చెందిన ఇద్దరు చొప్పున నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన నలుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో ఇద్దరు వైసిపి బలపరిచిన అభ్యర్థులుకాగా,మరో ఇద్దరు దేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులని ఆ గ్రామస్తులు తెలిపారు. దీనితో రెడ్డిచెర్ల సర్పంచి పదవితోపాటు ఏకగ్రీవమైన 12వ వార్డు మినహాయించి మిగిలిన 11 వార్డు పదవులకు ఈనెల 29వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారని ఆర్ ఓ పిచ్చయ్య తెలిపారు. సర్పంచి పదవి పోటీలో ఉన్న అక్కల రెడ్డి తిరుమల జ్యోతి కి మంచం గుర్తు, చెన్నంరాజు ధనలక్ష్మికి కత్తెర గుర్తు,రెడ్డి చర్ల రామలక్ష్మమ్మకు ఉంగరం గుర్తు,,అక్కల రెడ్డి వరునకు బుట్ట గుర్తు కేటాయించినట్లుగా ఆర్ఓ తెలిపారు. పోలింగ్ 29వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించి,మధ్యాహ్నం మూడు గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తారని అనంతరం ఫలితాలు వెల్లడిస్తారని ఎన్నికలు రిటర్నింగ్ అధికారి మోర్రి పిచ్చయ్య తెలిపారు.

తాటిచెర్ల సర్పంచిగా బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక

ఉప సర్పంచ్ గా మేకల వెంకటమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ గా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ గా మేకల వెంకటమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. తాటిచెర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి 10 వార్డు పదవులకు పలువురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు అయితే మంగళవారం నిర్వహించిన నామినేషన్ ఉపసంహరణ కార్యక్రమం సందర్భంగా సర్పంచ్ పదవికి బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ నామినేషన్ మినహా మిగిలిన వారందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకొని పోటీ నుంచి తప్పుకున్నారని, దీనితో తాటిచెర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఆర్వో ప్రకటించారు. అనంతరం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలలో మేకల వెంకటమ్మను వార్డు సభ్యులు ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ పంచాయతీలోని 10 వార్డులకు కూడా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. వెంకటేశ్వర్లు యాదవ్ తాటిచెర్ల గ్రామపంచాయతీ సర్పంచిగా ఎన్నిక కావడం పట్ల గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల



అశోక్ రెడ్డి,గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు బోనేని రమణమ్మ, ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి,, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు,,దద్దవాడ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ బిజ్జం రవీంద్రారెడ్డి, తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు , హర్షం వ్యక్తం చేస్తూ వెంకటేశ్వర్లు యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి, సహాయ సహకారాలు ఆశీస్సులతో తాను సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని అంటూ తాటిచెర్ల గ్రామపంచాయతీ అభివృద్ధికి శాసనసభ్యులు అశోక్ రెడ్డి, కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు బోనేని రమణమ్మ సహాయ సహకారాలతో కృషి చేస్తానని, తాటిచెర్ల గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు బోనేని రమణమ్మ,తాటిచెర్ల సర్పంచ్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ భార్యాభర్తలు.

క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమైనవి గూడూరి ఎరిక్షన్ బాబు



పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 25

ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్య సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు.పుల్లల చెరువు మండలం నాయుడు పాలెం గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి మందిరంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎరిక్షన్ బాబు కేక్ కట్ చేసి, క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.క్రీస్తు జన్మ విశిష్టత, ఆయన బోధనలు, క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమైనవని, ప్రేమ, కరుణ, సేవ, సహనం, శాంతి వంటి విలువలు సమాజంలో ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.150 కోట్లు కేటాయించిందన్నారు.క్రైస్తవుల సంక్షేమం, జెరుసలేం యాత్రలు, విదేశీ విద్యను అభ్యసించే వారికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, ఈ అవకాశాలను క్రైస్తవ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్రిస్మస్ పండుగ ప్రతి ఇంటా శాంతి, సంతోషం, సమాధానాలను నింపాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎడమ కళ్ళు సర్పంచిగా మిద్దెల గణేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం ఎడమకల్లు గ్రామ సర్పంచ్ గా తెలుగుదేశం పార్టీ బలపరిచిన మిద్దెల గణేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఎడమకల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయగా, వారిలో మంగళవారం మిద్దెల గణేష్ కుమార్ తప్ప మిగిలిన అభ్యర్థులందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని దీనితో సర్పంచ్ గా గణేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించామని ఆయన తెలిపారు. గణేష్ కుమార్ ఎడమ కళ్ళు గ్రామ సర్పంచిగా



ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మండల పరిషత్ అధ్యక్షురాలు బోనేని రమణమ్మ, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు రవీంద్రారెడ్డి, ఎడమకల్లు ఎంపీటీసీ సభ్యురాలు మూర్ఖ రాజేశ్వరి, తెలుగుదేశం పార్టీ నాయకులు గురుస్వామి రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా





పొదిలి, పెన్ పవర్, నవంబర్ 25

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పంకజ్ కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం నాడు పొదిలి పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ మరియు ఎన్నికల సామాగ్రి పంపి ణీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి భద్రత ఏర్పాట్లును పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలను సిబ్బందికి అందజేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో జరగాలని, అందుకు భిన్నంగా జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి పంకజ్ కుమార్ మీనా వెంట ఓ ఎస్ డి నవ జ్యోతి మిశ్రా, పొదిలి నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్, పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. రాజేష్ కుమార్, ఎస్ ఐ సూరెడ్డి రాజేష్, కొడకనమెట్ల ఎస్ ఐ శ్రీకాంత్ తోపాటు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

పోలీసులకు ఎస్పీ పంకజ్ కుమార్ మీనా దిశానిర్దేశం





కనిగిరి పెన్ పవర్, నవంబర్ 25:

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నవంబర్ 26న జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల బందోబస్తుపై జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలీస్ అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, మొబైల్ పార్టీలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లైన్ వేయించి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.అదే రోజు జరిగే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రక్రియకు తగిన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపు వరకు పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలంతా భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ పంకజ్ కుమార్ మీనా విజ్ఞప్తి చేశారు.

అల్లినగరం సర్పంచి ఎన్నికల బరిలో అభ్యర్థులు వీరే

10 వార్డులలో 5 వార్డు ఏక గ్రీవం,మరో ఐదు వార్డులకు ఎన్నికలు.





కొమరోలు పెన్ పవర్ నవంబర్ 25

కొమరోలు మండలం అల్లినగరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటీపడుతున్నారు. దీనితో ఆ పంచాయతీ సర్పంచ్ పదవికి ఐదు వార్డులకు ఈనెల 29న పోలింగ్ అనివార్యమైంది. అల్లినగరం సర్పంచ్ పదవికి ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు చేశారు వారిలో వైసిపి బలపరిచిన ముగ్గురు అభ్యర్థులు తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఐదు మంది అభ్యర్థులు ఉన్నారు. అయితే మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా వైసిపి బలపరిచిన ముగ్గురు అభ్యర్థులు తెలుగుదేశం పార్టీ బలపరిచిన ముగ్గురు అభ్యర్థులు తమనామినేషన్లను ఉపసంహరించుకున్నారు అయితే తెలుగుదేశం పార్టీ బలపరిచిన మరో ఇద్దరు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మొర్రి పిచ్చయ్య బొండిగల చిన్న వెంకటసుబ్బయ్యకు మంచం గుర్తు,షేక్ సత్తార్ కు కత్తెర గుర్తు కేటాయించారు. ఆ పంచాయతీ లోని 10 వార్డులలో ఒకటో వార్డు నుంచి ఐదో వార్డు వరకు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఆరో వార్డు నుంచి పదవ వార్డులకు ఇద్దరు చొప్పున అభ్యర్థులు పోటీలో మిగిలారు. దీనితో సర్పంచ్ పదవికి ఐదు వార్డులకు ఈనెల 29వ తేదీన పోలింగ్ నిర్వహించవలసి ఉన్నదని, పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించి మధ్యాహ్నం మూడు గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తారని అనంతరం ఫలితాలు వెల్లడిస్తారని ఎన్నికలు రిటర్నింగ్ అధికారి డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలిపారు.

బాబాయ్--అబ్బాయ్ జోడీకి ఏకగ్రీవ పట్టాభిషేకం!

వైఎస్సార్ స్వగ్రామం బలపనూరులో ఒకే కుటుంబానికి రెండు కీలక పదవులు

సర్పంచ్‌గా కొత్తరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి.. ఎంపీటీసీగా కొత్తరెడ్డి రవిచంద్ర రెడ్డి ఎన్నిక



సింహాద్రిపురం, పెన్ పవర్ నవంబర్ 24

రాజకీయాల్లో కుటుంబ అనుబంధం మరోసారి ప్రత్యేకతను చాటుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్వగ్రామమైన బలపనూరులో ఒకే కుటుంబానికి చెందిన బాబాయ్--అబ్బాయ్ ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామానికి తెరలేపారు. గ్రామంలో రెండు కీలక పదవులను పోటీ లేకుండా కైవసం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. బలపనూరు గ్రామ సర్పంచ్‌గా కొత్తరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీగా కొత్తరెడ్డి రవిచంద్ర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరూ బాబాయ్--అబ్బాయ్ కావడం ఈ ఎన్నికల్లో విశేషంగా నిలిచింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నాయకులు గ్రామస్థాయి రెండు కీలక పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో గ్రామంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

అభివృద్ధే ప్రధాన ఎజెండా

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

ఒకే కుటుంబం.. రెండు బాధ్యతలు

బలపనూరు గ్రామాభివృద్ధిలో సర్పంచ్, ఎంపీటీసీ ఇద్దరూ సమన్వయంతో పనిచేసి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరుతున్నారు. వైఎస్సార్ స్వగ్రామంలో బాబాయ్--అబ్బాయ్ జోడీకి లభించిన ఈ ఏకగ్రీవ ఎన్నిక స్థానికంగా ప్రత్యేక చర్చకు దారితీసింది.

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామికి వెండి శఠగోపం సమర్పణ

ఆత్రేయపురం, పెన్ పవర్ నవంబర్ 24

ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నివాసి బొడసింగ్ రామారావు, లక్ష్మీ కుటుంబ సభ్యులు వెండి శఠగోపం సమర్పించారు. 266 గ్రాముల బరువు గల వెండి శఠగోపం విలువ సుమారు 55 వేల రూపాయలు ఉంటుందని ఆలయ అధికారి నల్లం సూర్య చక్రధర్ వరావు తెలిపారు.కుటుంబ సభ్యులు దేవస్థానం అధికారులకు శఠగోపంను అందజేశారు.



నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం

ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 25

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఒంగోలులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పరిషత్తు అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్ ఆహ్వానించారు. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, సభల ఆహ్వాన పత్రికను అందజేశారు. డిసెంబర్ 19, 20 తేదీల్లో ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ మహాసభలు జరగనున్నాయని గజల్ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ 19న ఉదయం 10:30 గంటలకు జరిగే ప్రారంభోత్సవ వేడుకకు విచ్చేయాలని కోరినట్లు చెప్పారు. తెలుగు భాష చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 16 ఏళ్ల లోపు బాలబాలికల కోసం, వారి చేతనే ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించామని గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగు భాషలోని వివిధ సాహిత్య ప్రక్రియల్లో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు కళా ప్రాంగణం, టంగుటూరి ప్రకాశం పంతులు ప్రధాన వేదికపై జరగనున్న ఈ వేడుకలకు 30 దేశాల నుండి బాల ప్రతినిధులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరుకానున్నట్లు




వెల్లడించారు. తమ ఆహ్వానానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభల ముఖ్య సమన్వయకర్తలు డా. కె. మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి సర్పంచి, ఉప సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

సర్పంచిగా జక్కుల చిన్నరామయ్య, ఉప సర్పంచిగా, చిన్నావుల బాల నారాయణమ్మ ఎన్నిక.

బ్రాహ్మణపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మొర్రి పిచ్చయ్య



కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24

కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి నామినేషన్ల కేంద్ర పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ కేంద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి మొర్రిపిచ్చయ్య తెలిపారు. బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన పలువురు అభ్యర్థులు మంగళవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన నామినేషన్ అభ్యర్థి జక్కుల చిన్న రామయ్య బ్రాహ్మణపల్లి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. అనంతరం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలలో వార్డు సభ్యులు చెన్నావుల బాల నారాయణమ్మను ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభాకాంక్షలు తెలిపారు.ఇక తమ కేంద్ర పరిధిలో గల అల్లినగరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి షేక్ సత్తార్, బొండిగల వెంకటసుబ్బయ్య అనే ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఆయన తెలిపారు. వారిలో బొండిగల వెంకటసుబ్బయ్యకు మంచం గుర్తు, షేక్ సత్తార్ కు కత్తెర గుర్తు కేటాయించామని ఆయన తెలిపారు.రెడ్డి చర్ల సర్పంచ్ పదవికి నలుగురు అభ్యర్థులు పోటీలో మిగిలారని, వారిలో అక్కల రెడ్డి తిరుమల జ్యోతి కి మంచం గుర్తు చెన్నమరాజు ధనలక్ష్మికి కత్తెర గుర్తు రెడ్డి చర్ల రామలక్ష్మమ్మకు ఉంగరం గుర్తు అక్కల రెడ్డి వరుణకు బుట్ట గుర్తు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అల్లినగరం రెడ్డి చర్ల గ్రామపంచాయతీలకు ఈనెల 29వ తేదీ 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మూడు సాయంత్రం మూడు గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారని ఇచ్చే తెలిపారు. ఆ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోతుగంటి దస్తగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సమస్యలకు మరో అవకాశం.. నేటికీ రెవెన్యూ టాక్స్ మేళా

ప్రజల స్పందనతో మరో రోజు కొనసాగింపు

పన్ను మదింపు, వివరాల సవరణలు, ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, పెన్ పవర్ నవంబర్ 24

ఆస్తి పన్ను చెల్లింపుదారుల సమస్యలను పరిష్కరించేందుకు జీవీఎంసీ చేపట్టిన ప్రత్యేక రెవెన్యూ టాక్స్ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు గురువారం నవంబర్ 26వ తేదీన కూడా మేళాను కొనసాగించాలని జీవీఎంసీ నిర్ణయించింది. ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఒకే చోట అధికారుల సేవలు

నగర పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో గత రెండు రోజులుగా అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రత్యేక రెవెన్యూ టాక్స్ మేళాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పన్ను సంబంధిత సమస్యల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సంబంధిత అధికారులు ఒకే చోట అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.

పన్ను వివరాల్లో సవరణలకు అవకాశం

ఆస్తి పన్ను మదింపు, పన్ను వివరాల్లో తప్పులు, సవరణలు, ఇతర రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులను ఈ మేళాలో అధికారులు స్వీకరిస్తున్నారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని మరో రోజు కూడా మేళాను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఫిర్యాదులను సంబంధిత జోనల్ కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా జీవీఎంసీ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై మీ అభిప్రాయం చెప్పండి.. కోడ్‌తో ఫీడ్‌బ్యాక్

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రజల స్పందనకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశం

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సంబంధిత అధికారి నుంచి స్పందన: శేష శైలజ



విశాఖపట్నం, పెన్ పవర్ నవంబర్ 24

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా సమర్పించిన అర్జీల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ కోరారు. ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను తెలుసుకోవడంతో పాటు అర్జీల పరిష్కారంలో మరింత పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించిన వారు తమ సమస్య పరిష్కారంపై అభిప్రాయాలను తెలియజేసేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ రూపొందించిందని వెల్లడించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే స్పందన

అర్జీదారులు తమ అర్జీ పరిష్కారానికి సంబంధించిన అభిప్రాయాలను తెలియజేయాలంటే ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అందించే అభిప్రాయాల ఆధారంగా సంబంధిత అధికారులు అర్జీదారులను సంప్రదించి అవసరమైన వివరాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన సేవలు

పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజల అభిప్రాయాలు కీలకమని శేష శైలజ తెలిపారు. అర్జీ పరిష్కారంపై సంతృప్తి, అసంతృప్తి వివరాలను స్పష్టంగా తెలియజేయడం ద్వారా సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి అర్జీదారుడు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పెన్ పవర్

గురువారం 26 నవంబర్ 2026

“ఆట హాస్యాస్పదంగా మారింది”..

వైభవ్ రికార్డుపై మంజ్రేకర్ సంచలన వ్యాఖ్యలు

53 బంతుల్లో 204 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ

వైభవ్ ప్రతిభను కొనియాడిన మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్

వైట్ బాల్ క్రికెట్ హాస్యాస్పద స్థితికి చేరిందంటూ కామెంట్స్

ఆట పూర్తిగా బ్యాటర్ల వైపే మొగ్గుచూపుతోందని ఆందోళన

కేవలం బ్యాటింగ్ మాత్రమే క్రికెట్ కాదంటూ ఎక్స్‌లో పోస్ట్





యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ యూఏఈపై 53 బంతుల్లోనే 204 పరుగులు బాది సృష్టించిన విధ్వంసంపై భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ అసాధారణ ప్రతిభను ప్రశంసిస్తూనే, ప్రస్తుత పరిమిత ఓవర్ల క్రికెట్ (వైట్ బాల్ క్రికెట్) ఎంత హాస్యాస్పదమైన స్థితికి చేరుకుందో చెప్పడానికి ఈ ఇన్నింగ్స్ నిదర్శనమని అభిప్రాయపడ్డాడు. ఆట పూర్తిగా బ్యాటర్ల వైపే మొగ్గుచూపుతోందని ఆందోళన వ్యక్తం చేశాడు.

దోహా వేదికగా జరిగిన ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భాగంగా భారత్-ఎ తరపున ఆడిన వైభవ్, 7 ఫోర్లు, 28 సిక్సర్లతో 384.90 స్ట్రైక్ రేట్‌తో ఈ ఘనత సాధించాడు. 28 బంతుల్లోనే సెంచరీ, 52 బంతుల్లో డబుల్ సెంచరీ చేసి లిస్ట్-ఎ చరిత్రలోనే సరికొత్త రికార్డులను నెలకొల్పిన విషయం తెలిసిందేఈ ఇన్నింగ్స్‌పై సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా స్పందించిన మంజ్రేకర్, “వైభవ్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. అందులో ఎలాంటి సందేహం లేదు.

కానీ అతడు ఆడిన ఈ ఇన్నింగ్స్ వైట్ బాల్ క్రికెట్ ఎంతటి హాస్యాస్పద దశకు చేరిందో మరోసారి గుర్తుచేసింది. అభిమానులు కోరుకునేది ఇదే అనుకోవడం పెద్ద భ్రమ. క్రికెట్ అనేది బ్యాట్, బంతి రెండింటికీ సమానమైన ఆట.. కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే కాదు” అని పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బౌలర్లకు ఎలాంటి రక్షణ లేకుండా పోతోందన్న చర్చకు మంజ్రేకర్ వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి.

ఐపీఎల్ 2027 వేలం కోసం 1,220 మంది ఆటగాళ్లతో రిజిస్టర్ విడుదల.. అందుబాటులో 66 స్లాట్లు మాత్రమే!

- **డిసెంబర్ 16న గోవాలో జరగనున్న వేలంలో 66 స్లాట్ల భర్తీ**
- **రిజిస్టర్‌లో అత్యధికంగా 994 మంది అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు**
- **లక్నో వద్ద అత్యధికంగా రూ.47.45 కోట్లు.. గుజరాత్ వద్ద అత్యల్పంగా రూ.8.75 కోట్లు**
- **ఆటగాళ్ల తుది వేలం జాబితా డిసెంబర్ 4న విడుదల**



ఐపీఎల్ 2027 సీజన్ కోసం నిర్వహించే మినీ వేలం సందడి మొదలైంది. ఈ వేలం కోసం మొత్తం 1,220 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఐపీఎల్ నిర్వాహకులు తాజాగా ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 16న గోవా వేదికగా ఈ వేలం జరగనుండగా, పది ఫ్రాంచైజీలు కేవలం 66 ఖాళీలను మాత్రమే భర్తీ చేయనున్నాయి.ఈసారి విడుదలైన ఆటగాళ్ల రిజిస్టర్‌లో 939 మంది భారత ఆటగాళ్లు, 281 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఇప్పటికే ఫ్రాంచైజీలు 184 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా, మిగిలిన 66 స్లాట్లలో గరిష్ఠంగా 25 స్థానాలను మాత్రమే విదేశీ ఆటగాళ్లతో భర్తీ చేసే అవకాశం ఉంది. ఈ జాబితాలో అన్‌క్యాప్డ్ ఆటగాళ్లదే హవా నడుస్తోంది. మొత్తం 994 మంది అన్‌క్యాప్డ్ (అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని) ఆటగాళ్లు రిజిస్టర్ చేసుకోగా, 184 మంది క్యాప్డ్ ఆటగాళ్లు, 42 మంది అసోసియేట్ దేశాల ఆటగాళ్లు ఉన్నారు.విదేశీ ఆటగాళ్లలో అత్యధికంగా ఆస్ట్రేలియా నుంచి 53 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా నుంచి 40, వెస్టిండీస్ నుంచి 36, న్యూజిలాండ్ నుంచి 25, ఆఫ్ఘనిస్థాన్ నుంచి 23, శ్రీలంక నుంచి 21 మంది ఆటగాళ్లు ఉన్నారు. అసోసియేట్ దేశాల్లో అమెరికా నుంచి అత్యధికంగా 13 మంది ఉండటం విశేషం.ప్రస్తుతం పది ఫ్రాంచైజీల వద్ద కలిపి వేలంలో ఖర్చు చేయడానికి రూ.295.60 కోట్ల పర్స్ మిగిలి ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ వద్ద అత్యధికంగా రూ.47.45 కోట్లు ఉండగా, ఆ జట్టు 7 స్లాట్లను భర్తీ చేయాల్సి ఉంది. గుజరాత్ టైటాన్స్ వద్ద అత్యల్పంగా రూ.8.75 కోట్లు మాత్రమే ఉండగా, ఆ జట్టుకు 3 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ (రూ.39.50 కోట్లు), ముంబై ఇండియన్స్ (రూ.30.25 కోట్లు) అత్యధికంగా చెరో 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.40.15 కోట్లతో ఏడుగురిని, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.14.15 కోట్లతో ఐదుగురిని తీసుకోవాల్సి ఉంది.ఫ్రాంచైజీలు ఈ రిజిస్టర్ నుంచి తమకు ఆసక్తి ఉన్న ఆటగాళ్ల జాబితాను ఐపీఎల్ నిర్వాహకులకు పంపుతాయి. ఆ తర్వాత డిసెంబర్ 4న వేలంలో పాల్గొనే ఆటగాళ్ల తుది జాబితాను విడుదల చేయనున్నారు.

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా దూకుడు.. పంత్, గిల్, జైస్వాల్ హవా.. టాప్-10లో మనోళ్ల జోరు



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత బౌలింగ్ సంచలనం జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లతో రాణించిన బుమ్రా, ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి బౌలర్ల జాబితాలో సంయుక్తంగా రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇంగ్లాండ్ పేసర్ ఓలీ రాబిన్సన్‌తో కలిసి బుమ్రా రెండో స్థానంలో నిలవగా, అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ కంటే కేవలం 25 రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుకబడి ఉన్నాడు. మరోవైపు బ్యాటర్ల విభాగంలోనూ భారత ఆటగాళ్లు సత్తా చాటారు. న్యూజిలాండ్‌పై తొలి టెస్టులో 128 పరుగులతో మెరిసిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఆరో స్థానానికి చేరుకుని భారత్ తరఫున అత్యుత్తమ ర్యాంకర్‌గా నిలిచాడు. అదే మ్యాచ్‌లో 98 పరుగులు చేసిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఏడో స్థానాన్ని, 85 పరుగులు సాధించిన యశస్వి జైస్వాల్ తొమ్మిదో స్థానాన్ని నిలబెట్టుకుని టాప్-10లో కొనసాగుతున్నారు. దీంతో టాప్-10 టెస్ట్ బ్యాటర్ల జాబితాలో ముగ్గురు భారత ఆటగాళ్లు స్థానం దక్కించుకున్నారు. మిగతా భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 25వ స్థానానికి చేరుకున్నాడు. తొలి టెస్టులో 80 పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

ఇతర జట్ల విషయానికి వస్తే.. దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా మూడో స్థానానికి చేరాడు. ఎనిమిది వికెట్లతో అదరగొట్టిన పేసర్ కగిసో రబాడ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును దక్కించుకున్నాడు.


యంగ్ హీరో మేకోవర్‌పై బిగ్ డిబేట్



సముద్ర తీరంలో పాస్టెల్ పింక్ జిప్పర్ స్విమ్‌సూట్ లో మెరిసిపోతున్న మానుషి చిల్లర్







సిద్ధి ఇద్నాని బ్రీజీ మూవ్ డ్రెస్ పర్ఫెక్ట్

యువ నటుడు విశ్వక్ సేన్ స్లిమ్ లుక్, మేకోవర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఆయన కొత్త లుక్‌పై నెటిజన్లు మీమ్స్, సెటైరికల్ కామెంట్లతో స్పందిస్తున్నారు. కొందరు సినిమా పాత్ర కోసమే ఈ మార్పు అని భావిస్తుండగా, మరికొందరు హెయిర్ స్టైలింగ్‌పై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ‘ఇఎన్ఇ రిపీట్’ విజయం కూడా విశ్వక్ కెరీర్‌కు ఊతమిచ్చింది.స్టార్ల అధిక బరువు లేదా స్లిమ్ లుక్ గురించి మాట్లాడేందుకు అభిమానుల్లో ఆసక్తి ఉంటుంది. ఆంధ్రావాలా సినిమా సమయంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ లుక్ గురించి ఇలానే మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ అధిక బరువు నుంచి బయటపడి స్లిమ్ గా మారాక కూడా అతడి గురించి చాలా మాట్లాడుకున్నారు.

ఇప్పుడు సోషల్ మీడియాలో యువనటుడు విశ్వక్ సేన్ లుక్ - మేకోవర్ గురించి చాలా చర్చ సాగుతోంది. ఇటీవల అతడి స్లిమ్ లుక్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను చూసిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చకు తెరలేపారు. కొందరు ఇది సినిమా పాత్రల కోసం ట్రై చేసిన లుక్ అని పేర్కొంటుండగా...మరికొందరు లుక్‌లోని స్టైలింగ్, విగ్ - హెయిర్ ప్యాచ్‌పై సరదాగా.. సెటైరికల్‌గా స్పందిస్తున్నారు.కొందరు ఇది -గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి- తరహా లుక్‌లా ఉందని ... తొలుత చూసి బాలకృష్ణ ఏమో అనుకున్నానని రకరకాల కామెంట్లు చేసారు. మరోవైపు ఇలా సన్నగా లేదా భిన్నంగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయితే ఇంట్లో వాళ్లు, బంధువులు --ఏరా చిక్కిపోయావ్.. డైట్ ఆ, డబ్బులు దాచి పెడుతున్నావా?-- అంటూ వేసే ప్రశ్నలపై ఒక నెటిజన్ ఫన్నీ కామెంట్ నెట్టింట నవ్వులు పూయిస్తోంది.సినీ నటుల మేకోవర్‌లు, గెటప్ మార్పులపై సోషల్ మీడియాలో ఎప్పటిలాగే మీమ్స్, సెటైర్లు, విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. సినిమా ప్రాజెక్టుల కోసమే ఇలాంటి లుక్స్ ట్రై చేస్తారని కొందరు సమర్థిస్తుండగా.. నెటిజన్ల ఫన్నీ రియాక్షన్లు ఈ ట్రెండ్‌ను మరింత వైరల్‌గా మార్చాయి. విశ్వక్ సేన్ నటించిన తాజా చిత్రం ఇఎన్ఇ రిపీట్ ఇటీవల విడుదలై హిట్ కొట్టింది.

అతడి కెరీర్ కి ఇది బిగ్ బూస్ట్ అని చెప్పాలి. యువహీరో నటిస్తున్న ఇతర ప్రాజెక్టులకు ఈ విజయం ఆయువుగా ఉపయోగపడుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com